క్లుప్తంగా

ఉచిత వివాహాలకు నమోదు చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): అంజుమన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం యువతులకు ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని సంఘం అధ్యక్షుడు సయ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 26న అంజుమన్ షాదీఖానాలో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తామని, ప్రతి వధువుకు రూ.40వేలు అందజేస్తామని చెప్పారు. ఫిబ్రవరి 18 లోపు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగానున్న అంజుమన్ షాదీఖానాలో దరఖాస్తులు పూర్తి చేసి అందజేయాలని కోరారు. అబ్దుల్‌హక్, ఇక్బాల్, ఇదాయతుల్లా, మున్నా పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ: మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారు జామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, అక్కంపల్లె, ఇంజేడు, కొండుపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారికి అభిషేకాలు చేసి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి హారతులు పట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఉపాధ్యాయినులకు సన్మానం


ఉపాధ్యాయినులను సన్మానించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): భారత తొలి ముస్లిం ఉపాధ్యాయిని ఫాతిమా షేక్ 192వ జయంతిని పురస్కరించుకొని జమాతే ఇస్లామి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను ఆదివారం స్థానిక కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మహిళా విభాగం కన్వీనర్ బేగం అమ్తుసలాం మాట్లాడుతూ ఫాతిమా షేక్ దేశంలో మత సామరస్యానికి ముస్లిం మహిళల విద్యాభివృద్ధికి, మహాత్మాజ్యోతిరావు పూలే దంపతులతో కలిసి కృషి చేసిందని చెప్పారు. ఉపాధ్యాయినులు నూర్జహాన్, నజీరున్నిసా, హిల్డా శిషీలియా, మాగజ్వెల్‌లను సన్మానించి మెమొంటో అందజేశారు.

ముగ్గుల పోటీలు


బహుమతులు అందుకున్న మహిళలతో బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ప్రథమనందిలోని గాయత్రి దేవాలయంలో ఆదివారం బ్రాహ్మణ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 50మంది మహిళలు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా సీతాకుమారి, రాంప్రసాద్ వ్యవహరించారు. ప్రతిభ చూపిన మహిళలకు నగదు బహుమతులు అందజేశారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి నగర డోన సుధీర్, నాగేంద్ర, కేశవమూర్తి, సత్యనారాయణ, రేణుక పాల్గొన్నారు.

ఉద్యోగాల సాధనతో గుర్తింపు


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఉన్నత చదువు, ఉద్యోగాల సాధన ద్వారానే అంధులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని, అంధులు ప్రతి చైతన్యవంతంతో సమాజానికి, కుటుంబానికి మంచిపేరు తెచ్చే పనులు చేయాలని నవనంది రోటరీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. లూయిస్ బ్రెయిలీ జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక స్వామి వివేకానంద ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాటాడారు. అనంతరం డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదనరావు, దస్తగిరిరెడ్డి, డాక్టర్ సునీత, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రాజశేఖర్, క్రాంతి చైతన్య, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అంధులకు ట్రైసైకిళ్లు అందజేశారు. అంధుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుర్రప్ప, ఓబులేసు, మస్తాన్‌వలి బహుమతులు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో శివ మాలధారణ

ఆత్మకూరు: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు మహాశివరాత్రి రోజున ఇరుముడి సమర్పించేందుకు భక్తులు ఆదివారం పలు శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో శివ మాలాధారణ చేపట్టారు. పట్టణంలోని పాత,కొత్త శివాలయాల్లో ఆదివారం శుభదినం కావడంతో శివ మాలాధారణకు భక్తులు ఆసక్తి చూపారు.


తన సూపర్ మార్కెట్‌లో మహిళలకు వస్తువులను చూపుతున్న మహిళ పేరు సుభాషిణి. ఈమె పొదుపు సంఘం ద్వారా రూ. 1.50లక్షలు రుణం తీసుకొని, దానికి మరో రూ.4లక్షలు జమ చేసి సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసింది. వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.20వేలు మాఫీ అయ్యింది. వ్యాపారం ద్వారా కుటుంబ పోషణకు ఇబ్బందులు లేవని చెబుతోంది.


తన దుకాణంలో ఆయిల్ మేకింగ్ మిషన్ నుంచి ఆయిల్ తీస్తున్న ఈమె పేరు రమాదేవి. కిరాణ దుకాణంతో పాటు ఆయిల్ మేకింగ్ మిషన్ ద్వారా వేరుశనగ, కొబ్బెర, జీడిపప్పు, నువ్వులు, బాదం వంటి నూనెలు తయారు చేస్తుంది. అలాగే కొబ్బెర తురిమే మిషన్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తోంది.


రామచంద్రాపురం ఏరియల్ వ్యూ

ఆదర్శం.. రామచంద్రాపురం


విశాలంగా సీసీ రోడ్డు.. ఇరువైపులా పచ్చదనం

చిన్న గ్రామమైనా.. ఆదర్శంగా నిలుస్తోంది. స్వార్థాలు పక్కన పెట్టి గ్రామాభివృద్ధి కలిసికట్టుగా నిర్ణయాలు తీసుకుంటుండటంతో అన్నింటా ముందంజలో ఉంటోంది. 2007లో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా గ్రామంగా ప్రకటించింది. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రత్యేక నిధులిస్తామని ప్రకటించడంతో ఎన్నికలు ఏకగ్రీవం అవుతున్నాయి. ఆ నిధులతో విశాలమైన రోడ్లు, పచ్చదనం, మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నారు. మహిళలు స్వయం ఉపాధిలో రాణిస్తుండటం, పట్టణ స్థాయి వసతులు సమకూరడంతో మినీ పట్టణంగా అలరారుతోంది రామచంద్రాపురం.

- అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న గ్రామం
- గ్రామంలో సూపర్ మార్కెట్, ఆయిల్ మేకింగ్ యంత్రాలు అందుబాటులో
- ఊరంతా విశాలమైన సీసీ రోడ్లు, పచ్చదనం
- మండలంలో 'వైఎస్సార్ ఆసరా' కింద అధికంగా లబ్ధి పొందిన పల్లె
- స్వయం ఉపాధిలో రాణిస్తున్న మహిళలు

గ్రామం	: రామచంద్రాపురం
జనాభా	: 1,872
ఓటర్లు	: 1,225
పొదుపు గ్రూపులు	: 43 పొదుపు సంఘాల్లో 438 మంది సభ్యులు
వైఎస్సార్ ఆసరా అర్హులు	: 322 మంది
మూడేళ్లలో పథకాల ద్వారా అందిన మొత్తం	: రూ.3.72 కోట్లు

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలో కేసీ కెనాల్, చుట్టూ పచ్చని పంటలు, ఊర్లో ప్రతి ఇంటి ముందు పచ్చని చెట్లతో ఆహ్లాదం పంచుతాయి. గ్రామస్తులు ఐక్యంగా ఉంటూ, ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుంటూ పట్టణ స్థాయి వసతులు సమకూర్చకొని ఆదర్శంగా జీవిస్తున్నారు.

ఎన్నికలు.. ఏకగ్రీవమే..

పంచాయతీ ఎన్నికల సమయంలో గ్రామస్తులంతా కలిసికట్టుగా ఎన్నికలను ఏకగ్రీవం చేసుకుంటున్నారు. 2007లో నాటి సీఎం వైఎస్సార్ ఆదర్శ గ్రామంగా ప్రకటించారు. ప్రతి సర్పంచ్ ఎన్నికలకు ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ఇచ్చే రూ.5లక్షలతో సీసీ రోడ్లు, ఇతర పనులకు ఉపయోగించుకుంటున్నారు. దీంతో ఊరంతా విశాలమైన సీసీ రోడ్లు వంద శాతం ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఇటీవల గ్రామంలో రూ.కోటి అంచనా వ్యయంతో విరాళాలతో శ్రీ ఓంకారేశ్వర ఆలయ నిర్మాణం చేపట్టారు. ఇన్నాళ్లు గ్రామంలో ఉండి వృత్తి, ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో జీవిస్తున్న వారు ఆలయ నిర్మాణానికి చందాలు అందజేస్తున్నారు.

పట్టణం అనిపించేలా...

పల్లెలో కిరాణం, చిల్లర కొట్టు ఉండటమే గగనం. అలాంటిది పట్టణంలో ఉన్నట్లు సూపర్ మార్కెట్, ఆయిల్ మేకింగ్ మిషన్‌లు సైతం ఈ గ్రామంలో అందుబాటులో ఉన్నాయి. అలాగే పాలకేంద్రాలు తదితర వసతులుండటంతో పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామస్తుల ముఖ్య వృత్తి వ్యవసాయం, పాడి పోషణ, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

మండలంలోనే అత్యధికంగా..

గ్రామంలో 43 పొదుపు సంఘాల్లో 438 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. మండలంలోనే అత్యధికంగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని లబ్ధి పొందుతున్నది ఈ గ్రామస్తులే. 322 మందికి రూ. 24.93 లక్షలు ప్రభుత్వం నుంచి అందాయి. అలాగే.. సున్నా వడ్డీ కింద 336 మంది మహిళలు రూ.14.05 లక్షలు పొందారు. గడచిన మూడేళ్లలో వివిధ పథకాల ద్వారా రూ.3.72 కోట్లను ప్రభుత్వం వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసింది.

అందరి సహకారంతో అభివృద్ధి



గ్రామస్తులు నన్ను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు కృషి చేస్తున్నాం. గ్రామంలో అన్ని రకాల వసతులు సమకూర్చేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటి వరకు అన్ని సమకూరాయి. ఇంకా ఏవైనా ఉన్నా వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో వెంటనే పరిష్కారమయ్యేలా పనిచేస్తాం. ముఖ్యంగా గ్రామస్తులంతా ఐకమత్యంగా ఉండటంతో ఈ స్థాయి సాధ్యమైంది.

– ఉమామహేశ్వరి, సర్పంచ్, రామచంద్రాపురం

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం



గ్రామస్తులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా పొదుపు సంఘాల ద్వారా వారు స్వయం ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తుండటంతో కుటుంబాల పోషణలో మహిళలు భాగస్వామ్యవుతున్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ అత్యధికంగా వారే పొందారు. పొదుపు రుణాలు తీసుకొని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించడంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. అన్ని గ్రామాలు ఇలాగే మారితే చాలా బాగుంటుంది.

– నాగఅనసూయ, ఎంపీడీఓ, దొర్నిపాడు

నాటి గురువులతో పూర్వ విద్యార్థులు



జ్ఞాపకాల దొంతర

- 37 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు
- మధుర స్మృతులతో ఉల్లాసంగా గడిపిన వైనం
- నాటి ఉపాధ్యాయులకు సన్మానం

శిరివెళ్ల: వారంతా 37 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. ఆ తరువాత ఎవరి దారుల్లో వారెళ్లిపోయారు. అయితే మనమంతా ఓ సారి కలుసుకుందామని కొందరు ముందుకొచ్చి అందరినీ ఒక చోట చేర్చారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేవు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సంతోషంగా గడిపారు. అలాగే తమకు నాడు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. మండలంలోని గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1985–86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నా రు. ముందుగా నాటి తమ గురువులు వేమారెడ్డి, ఈశ్వరరెడ్డి, మౌళాలి, శివారెడ్డి, బాలిరెడ్డిని సన్మానించారు. పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు పారితోషికాలు అందచేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేయాలని తీర్మానించారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు కేవీ సుబ్బారెడ్డి, నరసింహారావు, రంగారెడ్డి, రాజశేఖర్, అరుణ, శ్రీనివాసులరెడ్డి, హెచ్‌ఎం నాగమణి, లింగారి రమణారెడ్డి, పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


మహిళల సమస్యలను వింటున్న గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వైఎస్సార్ సీపీ సమ ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని పాములవీరయ్య వీధి, కర్నమయ్య వీధి, కందుకూరు రోడ్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి అందిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పడంతో పలువురు రేషన్ కార్డుల్లో పేరు మార్పులు, ఇంటి స్థలం , గృహాల బిల్లులు, మురుగు కాల్వల నిర్మాణం వంటి సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, రఘు, నజీర్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

బలిజ కులస్తుల పురోగతికి కృషి

ఆళ్లగడ్డ: సామాజికంగా, రాజకీయంగా బలిజల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని సంఘం నాయకులు పేర్కొన్నారు. రుద్రవరం మండలం గుర్రప్ప మాన్లు సమీపంలో ఆదివారం రాత్రి బలిజ యువత ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సంఘ పెద్దలు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాపు కార్పొరేషన్ తో ఈ ప్రాంతంలో ఉన్న రెడ్లు వారి సర్టిఫికెట్లలో కాపులని ఉండటంతో లబ్ధి పొందుతున్నారన్నారు. రాయలసీమ బలిజలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సంఘం నాయకులు నరసింహరావు, శెట్టి విజయకుమార్, గురుమూర్తి, యామా గుర్రప్ప, పత్తి సత్యనారాయణ, సిద్ధి సత్యం తదితరులున్నారు.

వాసవీమాతకు వైభవంగా మహాభిషేకం



వజ్రాల చీర అలంకరణలో వాసవీ మాత, పుష్పాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్‌బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో శ్రీ వాసవీ దీక్షా మండలి ఆధ్వర్యంలో వాసవీ మాతకు మహాభిషేక కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి 108 కలశాలతో చెరువు కట్ట నుంచి గంగా జలాన్ని కేరళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి మూలమూర్తి అమ్మవారిని అభిషేకించారు. అలాగే వివిధ ఫలాలతో, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకం చేపట్టి, వజ్రాల చీరతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి వివిధ పూలతో అభిషేకం జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పట్టణంలో గ్రామోత్సవం చేపట్టారు. మండలి అధ్యక్షుడు ఇనుగూరి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అయ్యపురెడ్డి రాఘవేంద్ర, భవనాశి వాసు, ఇందుమతి, శోభారాణి పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..


లక్ష్మణరావును ఆశీర్వదిస్తున్న వేదపండితులు


ఏఆర్ అడిషనల్ ఎస్పీని ఆశీర్వదిస్తున్న దృశ్యం

మహానంది: రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు మహానందీశ్వరుడికి ఆదివారం పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఏఈఓ మధు, సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర్ల స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం,కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆయన వెంట నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.రాధారాణి, జూనియర్ సివిల్ జడ్జి జి.అర్చన పాల్గొన్నారు. అలాగే..ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు కుటుంబసభ్యులతో కలిసి వచ్చి శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వరుడిని దర్శించుకుని అభిషేకం,కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం వారికి స్థానిక అలంకార మండపంలో వేదాశీర్వచనం చేసి స్వామి,అమ్మవార్ల ప్రసాదాలు అందించారు.

15న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండలంలోని కలచట్లలో15 వ తేదీన సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ప్రవేశ రుసుము రూ. 500 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మొదటి, రెండవ, మూడవ బహుమతులు రూ. రూ.40 వేలు, రూ.30వేలు, రూ.20 వేలు చొప్పున అందజేస్తామన్నారు. అదేవిధంగా నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 10 వేలు, రూ. 5 వేలు, రూ.3 వేల చొప్పున అందజేస్తామన్నారు.

20 నుంచి భక్తి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర 5వ భక్తి సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.జి.శరత్ చంద్రబాబు తెలిపారు. వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో 20 నుంచి 22వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే సమ్మేళనంలో 18 మంది స్వామీజీలు, రాష్ట్రంలో ఉన్న రామకృష్ణ సేవా సమితిల ప్రతినిధులు, సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ సమ్మేళనానికి కన్వీనర్‌గా శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ (ఎస్ఆర్‌కేవీబీపీపీ) రాయలసీమ కన్వీనర్ డాక్టర్ పి.పి.వి.డి. నాగ త్రిశూల పాణి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పాణ్యం: కొత్తూరు శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు ఆదివారం దాతలు విరాళం అందించారు. నంద్యాల పట్టణానికి చెందిన దండే పెద్ద వెంకటసుబ్బయ్య, వెంకట సుబ్బమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు దండే శ్రీనివాసులు రూ.77,777 నగదును ప్రధాన అర్చకుడు నారాయణస్వామికి అందించారు. ప్రస్తుతం ఆలయంలో మహాప్రాకారం, భక్తులు సౌకర్యార్థం ప్రత్యేక విడిది ఏర్పాటు పనులు జరుగుతున్నట్లు అర్చకుడు తెలిపారు.

మహిళలకు వంటల పోటీలు


మహిళలకు బహుమతులు అందజేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): సంక్రాంతి పండుగ సందర్భంగా బాలాజీ మర్చెంట్ కమిటీ కల్యాణ మండపంలో బాలాజీ మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ లక్ష్మీ సౌజన్య, తేజశ్వణి, మనోహర్‌రెడ్డి వ్యవహరించారు. ప్రథమ బహుమతి కూరకు వాసవి, ద్వితీయ బహుమతి ఆరవేటి లక్ష్మి, తృతీయ బహుమతి మల్లిక, ఇద్దరికి ప్రోత్సాహక బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. సభ్యురాళ్లు వాసవి, లీలా, గీతా, మల్లిక, నాగరత్నమ్మ, కృష్ణమూర్తి, నారాయణ పాల్గొన్నారు.

నవ నిర్మాణ సమితి సేవలు మరువలేనివి


శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ పోచా, చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తదితరులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పీవీ నగర్ రోడ్డులోని మున్సిపల్ హిందూ శ్మశాన వాటిక స్వర్గ ధామంలో చేస్తున్న అభివృద్ధి పనుల్లో నవ నిర్మాణ సమితి సేవలు మరువలేనివని ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. ఆదివారం స్వర్గం ధామం అభివృద్ధిలో భాగంగా కాల్వల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే వైషైను ప్రారంభించి, 13 అడుగుల శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వర్గధామంలో ఉద్యానవన నిర్మాణానికి తన సొంత నిధుల ద్వారా త్వరలో ఉద్యానవనాన్ని నిర్మిస్తామన్నారు. మరమ్మతులకు గురైన వైకుంఠ రథానికి ఎంపీ సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తారన్నారు. అనంతరం శ్మశాన వాటికలో నూతనంగా ఏర్పాటు చేసిన హస్తికలను భద్రపరిచే రూము, గ్యాస్ ఆధారిత కాల్పుల గదులను, గ్యాలరీలు, హరిశ్చంద్ర ఘాట్, పరిసరాల అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కల్లూరి రామలింగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిషా, ఏపీ ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి, నెరవాటి సత్యనారాయణ, కౌన్సిలర్లు పురందర్, సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్లు కత్తిశంకర్, భీమునిపల్లె సుబ్బయ్య, సమితి సభ్యులు డాక్టర్ మధుసూదనరావు, గుంటూరు ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి, గెలివి రామకృష్ణ, శేషుబాబు పాల్గొన్నారు. అలాగే.. సమితి సభ్యురాలు, ప్రముఖ స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ నాగమణి తన జన్మదినాన్ని స్వర్గధామంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ పని చేస్తున్న సేవకులు 50 మందికి ఒక నెల సరిపడ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.